సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 25 । జూలై । 2024



అందని ఎంసీహెచ్ కానుకలు

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించే వారికి ఇచ్చే ఎంసీహెచ్ కానుక జిల్లాలో 11,196 మందికి అందని ద్రాక్షగానే మారింది. 8లో



37,625 మందికి రుణమాఫీ

ఖమ్మం డీసీసీబీ పరిధిలో 37,625 మందికి రుణమాఫీ అమలవుతోందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
30°/ 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



స్వామివారికి తిరుమంజనం చేస్తున్న దృశ్యం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం వైభవంగా స్నపన తిరుమంజనం జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

ఏపీపీగా నాగలక్ష్మి బాధ్యతల స్వీకరణ



నాగలక్ష్మి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గాదె నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖమ్మం నగరానికి చెందిన తాను ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశానని, మధిర కోర్టు నుంచి బదిలీపై కొత్తగూడెం వచ్చానని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు చెక్



గుండాలపాడు గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

ములకలపల్లి: ప్రజలంతా తమ ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని ప్రజారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ తెలిపారు. ములకలపల్లి మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం గుండాలపాడు గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఇంటి ఆవరణలో పనికి రాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే, మురుగునీటి తొలగింపు, ఫాగింగ్‌పై సిబ్బందికి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, వైద్యాధికారి సాయికల్యాణ్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

చుంచుపల్లి: పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ మరణించిన వారి వారసులకు జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు బుధవారం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారు అధికారుల మన్ననలు పొందేలా విధుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కె.అరుణ,సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ నయీముద్దీన్, చైర్మన్ సీసీ వై.శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఈపీ ఆపరేటర్' మెరిట్ జాబితా విడుదల

సింగరేణి(కొత్తగూడెం): గత నెలలో నిర్వహించిన ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరీ ఇంటర్నల్ పోస్టుల మెరిట్ జాబితాను సింగరేణి యాజమాన్యం బుధవారం విడుదల చేసింది. ఈ పరీక్షకు 1,706 మంది హాజరు కాగా, 828 మంది డ్రైవింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్షకు ఎంపికయ్యారు. వీరికి జూన్ 30న పరీక్షలు నిర్వహించగా 810 మంది అర్హత సాధించారు. వారిలో మెరిట్ జాబితా ప్రకారం 100 మందిని ఎంపిక చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ జాగ.. ఇంతేనా ?

పడావు పడిపోతున్న పరిశ్రమల స్థలం

- 'స్పాంజ్ ఐరన్‌'పై ఎన్‌ఎండీసీ నిరాసక్తత
- కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం?
- రాజకీయ పార్టీలు ఒత్తిడి చేస్తే వచ్చే చాన్స్



స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో అందుబాటులో ఉన్న స్థలం (ఇన్‌సెట్) మూతపడిన పాల్వంచలోని ఎన్‌ఎండీసీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమకు చెందిన 423 ఎకరాల స్థలం రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంటోంది. ఈ స్థలాన్ని ఇతర పరిశ్రమలకు కేటాయించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం వంటి అంశాలపై నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) ఎలాంటి చొరవ చూపడం లేదు. పాత ప్లాంట్‌ను పునరుద్ధరించాలని, లేదంటే ఈ స్థలాన్ని ఇతర పరిశ్రమలకు అప్పగించాలనే డిమాండ్ ఇటీవల ఊపందుకుంటోంది.

పునరుద్ధరించాలి..

స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను పునరుద్ధరించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు దృష్టికి బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు ఇటీవల తీసుకెళ్లారు. స్పాంజ్ ఐరన్‌ను తిరిగి తెరవడంతో పాటు సంస్థకు చెందిన 423 ఎకరాల స్థలంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కోల్డ్ రోలింగ్ మిల్ కాంప్లెక్స్, హాట్ రోలింగ్ మిల్, ఎలక్ట్రికల్ రెసిస్టెన్స్ వెల్డెడ్ పైపుల పరిశ్రమ, సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఇథనాల్ ప్లాంట్, బ్యాటరీస్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు స్థాపించే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

పెట్టుబడుల రాకకు అవకాశం..

ఇటీవల ప్యాకేజింగ్ పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన బాల్ బేవరేజెస్ కంపెనీ రూ.700 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో స్ప్రేలు, బీర్లను ప్యాక్ చేసే టిన్నుల యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ఆ కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. యూనిట్ స్థాపనకు అవసరమైన భూమితో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ప్యాకేజీ ఇండస్ట్రీస్‌లో జిల్లా ఇప్పటికే దూసుకుపోతోంది. ఇందులో సారపాకలోని ఐటీసీ స్పెషల్ పేపర్స్ సంస్థ దేశంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటిగా నిలిచింది. బూర్గంపాడు మండలంలో కోడిగుడ్ల ప్యాకేజీ, కార్డ్ బోర్డు తయారీ పరిశ్రమలు విస్తారంగా ఉన్నాయి. దీంతో టిన్నుల పరిశ్రమను జిల్లాకు రప్పించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఫలించని యత్నాలు

ప్రభుత్వ ఆధీనంలోని సెయిల్, ఆర్సెల్లార్ మిట్టల్ సంస్థలు సంయుక్తంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో ఆధునిక టెక్నాలజీతో స్పాంజ్ ఐరన్ పరిశ్రమను పునః ప్రారంభిస్తాయని 2017లో కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు డీపీఆర్ రూపొందించాలని ఎన్‌ఎండీసీ, మెకాన్ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ తర్వాత ఈ అంశం కాలగర్భంలో కలిసిపోయింది. అనంతరం వచ్చిన రాజకీయ ఒత్తిడితో స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను 2019 జనవరిలో ఎన్‌ఎండీసీ సంస్థ ప్రయోగాత్మకంగా ప్రారంభించినా.. రెండు నెలలకే తిరిగి మూతపడింది. దీంతో ఇక్కడ పని చేస్తున్న వందలాది మంది కార్మికులను ఇతర ప్రాంతాలకు తరలించగా పరిశ్రమలపై పరోక్షంగా ఆధారపడిన వారి ఉపాధి దెబ్బతింది. చివరకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగినా అవి కూడా ఫలప్రదం కాలేదు.

రాజకీయ ఒత్తిడి ఉంటేనే..

బొగ్గు, నీరు, విద్యుత్, స్థలం ఇలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహజ వనరులు, రైలు, రోడ్డు మార్గం ద్వారా కనెక్టివిటీ వంటి అనుకూల అంశాలతో పాటు కావాల్సినంత కార్మిక శక్తి అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లాకు ఆశించి స్థాయిలో పరిశ్రమలు రావడం లేదు. ఇప్పటికే 2024 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో స్పాంజ్ ఐరన్ పరిశ్రమను తిరిగి నడిపించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో పడావు పడి ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమను పునఃప్రారంభించడం లేదా ఈ స్థలంలో కొత్త పరిశ్రమలు వచ్చేలా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఎన్‌ఎండీసీ రాకతో..

యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 1980లో దక్షిణాసియాలోనే మొదటిసారిగా కోల్ బేస్డ్ స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను పాల్వంచలో నిర్మించారు. మొదటి యూనిట్ విజయవంతం కావడంతో 1985లో రెండో యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత 1993లో ఈ ప్రాజెక్టు ఆధారంగా 7.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పారు. అనంతరం పిగ్ ఐరన్ నుంచి స్పాంజ్ ఐరన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను 1997లో నిర్మించారు. ఇలా దశల వారీగా అభివృద్ధి చెందుతూ వచ్చిన ఈ సంస్థను 2010లో ఎన్‌ఎండీసీలో విలీనం చేశారు. ఆ తర్వాత నిర్వహణ లోపాల కారణంగా నష్టాల బారిన పడి 2016లో పూర్తిగా మూతపడింది.

గోదావరి తగ్గుముఖం

రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ



కల్యాణకట్ట దిగువ వరకు ఉన్న గోదావరి ప్రవాహం

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. బుధవారం 48 అడుగుల దిగువకు నీటిమట్టం నమోదు కావడంతో భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్‌రావు రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. రాత్రి 10 గంటలకు 45.10 అడుగులతో 10,18,806 క్యూసెక్కుల నీరు ప్రవహించింది. నీటిమట్టం 43 అడుగులకు తగ్గితే మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరిస్తారు. ఇక చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు ఎత్తి వరదనీటిని గోదావరిలోకి వదులుతున్నారు. నదీ ప్రవాహం శాంతించినా తగ్గుదల స్వల్పంగా ఉండడంతో ముంపు మండలాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డీఓ సూచించారు.

నిర్లక్ష్యంగా ఉంటే సస్పెన్షనే..

- వైద్య సిబ్బందికి కలెక్టర్ జితేష్ హెచ్చరిక
- ఇల్లెందు ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ



ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇల్లెందు: ఆస్పత్రికి వచ్చే బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ వేటు తప్పదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాల్టీలో మందులు, రిజిస్టర్లను పరిశీలించాక.. గోడలపై నోటీస్ పేపర్లు అతికించి ఉండటాన్ని చూసి డాక్టర్లు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ వస్తువు ఎక్కడ ఉండాలో అక్కడే పెట్టాలని సూచించారు. వర్కర్లు వచ్చి శుభ్రం చేయాలని చూడొద్దని, ఎవరి గదిని వారే శుభ్రం చేసుకోవా లని, లేదంటే తానే కొత్తగూడెం నుంచి వచ్చి క్లీన్ చేసి వెళ్తానని అన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ.. తనపట్ల నర్స్ వ్యవహరించిన తీరును కలెక్టర్‌కు వివరించగా.. రోగుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం జనరల్ వార్డుకు వెళ్లగా ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండడాన్ని చూసి ఆవాక్కయ్యారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తమకు ఏ పరీక్ష చేసినా రిపోర్టులు ఇవ్వడం లేదని ఒకరు కలెక్టర్ దృష్టికి తేగా సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్ డాక్టర్ హర్షవర్ధన్, ఎండీ రాంనివాస్‌ను ప్రశ్నించగా ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీలకు ప్రింటర్, పేపర్ లేదని వారు సమాధానం ఇచ్చారు. దీంతో ఏడాదికి సరిపడా ఎంత పేపర్ కావాలో చెబితే పంపిస్తానని చెప్పారు. ఆస్పత్రిలో ఎన్ని పడకలు అవసరమైనా ఏర్పాటు చేస్తానని తెలిపారు. రక్త నిల్వ కేంద్రాన్ని పరిశీలించి డీఐతో ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రిని తనిఖీ చేసి ఏమేం సదుపాయాలు అవసరమో నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే కోరం కనకయ్య మంత్రికి వినతిపత్రం అందించారని, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కాగా, బుధవారం ఒక్కరోజే 97 మంది జ్వర పీడితులు రాగా, ఒక్కో బెడ్‌పై ముగ్గురు చొప్పున పడుకుని ఉండడాన్ని చూసి అవాక్కయిన కలెక్టర్.. తగిన సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. అందరికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీల పరిధి నుంచి వచ్చిన వారు ఉన్నారా అని ఆరా తీశారు. అనంతరం జనరల్ వార్డు, ఎక్స్‌రే గది, ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, వైద్యులు రాంనివాస్, బన్సీలాల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ యాదగిరి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, కౌన్సిలర్లు కటకం పద్మావతి, సయ్యద్ ఆజమ్, అంకెపాక నవీన్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

ఎస్పీ రోహిత్‌రాజ్



కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభోత్సవంలో ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

కొత్తగూడెంరూరల్: నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలతో ఇబ్బందులకు గురైన ప్రజలకు పోలీసులు అండగా నిలిచిన తీరు ప్రశంసనీయమని అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా అండగా ఉంటూ ప్రజల్లో ధైర్యం నింపాలన్నారు. కేసుల విచారణలో సందేహాలుంటే ఉన్నతాధికారుల సలహా తీసుకోవాలని సూచించారు. గుట్కా, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటుచేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన కాన్ఫరెన్స్ హాల్, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వర్, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని పరిరక్షించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



కొమ్ముపాగా ధరించి డోలు వాయిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనుల సంస్కృతి విభిన్నమైందని, వారి ఆచార వ్యవహారాలకు సంబంధించి ప్రతీ వస్తువును జాగ్రత్తగా ఉంచాలని అన్నారు. మ్యూజియం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం మనుబోతుల చెరువు వద్ద డంపింగ్ యార్డును పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ ఈఓ శ్రీనివాసరావును ఆదేశించారు. ఆ తర్వాత వైటీసీని సందర్శించి శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, వైటీసీ ఇన్‌చార్జ్ దివ్య, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన అందించాలి..

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని పీఓ రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. కిచెన్ షెడ్‌తో పాటు వంట సామగ్రిని శుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరా చారి, డీఈ హరీష్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాలిపేరుకు స్వల్పంగా పెరుగుతున్న వరద



తాలిపేరు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

చర్ల: తాలిపేరు ప్రాజెక్ట్‌కు మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాంతాలైన బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో తాలిపేరుకు వరద పోటెత్తుతోంది. దీంతో బుధవారం ఉదయం నుంచి గంటకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున పెరుగుతూ వచ్చిన నీటిమట్టం సాయంత్రం 6 గంటలకు 23,571 క్యూసెక్కులకు, రాత్రి 10 గంటలకు 21,963 క్యూసెక్కులకు చేరింది. గురువారం ఉదయానికి 30 నుంచి 32వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరద నేపథ్యంలో 25 గేట్లను పూర్తిగా ఎత్తి 21,963 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యాచరణ
- ఖాళీ స్థలాలు శుభ్రం చేయాలని యజమానులకు నోటీసులు
- నిధుల ఆధారంగా రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపడుతున్నాం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో పాల్వంచ మున్సిపల్ కమిషనర్ స్వామి



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ స్వామి

సాక్షి ఫోన్ ఇన్

పాల్వంచ: పట్టణ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి అన్నారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ప్రజలు లేవనెత్తిన పలు సమస్యలకు ఆయన సమాధానం ఇచ్చారు.

- **సమస్య :** ఓపెన్ ప్లాట్లలో నీళ్లు నిలుస్తున్నాయి. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయడం లేదు.

  – వేణు, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, నర్సింహారావు, పాత పాల్వంచ

కమిషనర్ : ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇబ్బందికరంగా ఉన్న ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేసి, పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల్లో అధ్వానంగా ఉన్న చోట ఫొటోలు, అడ్రస్‌లు పంపించండి. వాటిపై చర్యలు తీసుకుంటాం.

- **స :** రోడ్లు సరిగా లేవు. వర్షం వస్తే దోమలతో వల్ల ఇబ్బంది పడుతున్నాం. తాగునీటి సమస్య పరిష్కరించాలి

  – బోడా వినోద్, శివనగర్

క : శివనగర్ ఏరియాలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేశాం. మరికొన్ని నిధులు కూడా అక్కడ త్వరలోనే ఖర్చుచేస్తాం. తాగునీటి సమస్య పరిశీలిస్తాం. పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయడంతో పాటు పందుల సంచారం ఉన్న ప్రాంతాలపై దృష్టి సారిస్తాం.

- **స :** కాంట్రాక్టర్స్ కాలనీ చర్చ్ రోడ్డు పొడవునా చెట్లు కొట్టి పడేశారు. కుక్కల బెడద ఉంది. ఖాళీ ప్లాట్లలో నీరు నిలుస్తుండడంతో దోమలు, పాములు వస్తున్నాయి.

  – శైలజ, కాంట్రాక్టర్స్ కాలనీ

క : పారిశుద్ధ్య సిబ్బందితో చెట్ల కొమ్మలు తీయిస్తాం. కుక్కలకు పట్టి ఎప్పటికప్పుడు స్టెరిలైజేషన్ చేయిస్తున్నాం. నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

- **స :** డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. మురుగు అందులో జామ్ అవుతోంది. రోడ్లపై బ్లీచింగ్ చల్లడం లేదు

  – చారి, విద్యుత్ కాలనీ

క : డ్రెయినేజీలు తప్పకుండా శుభ్రం చేయిస్తాం. మురుగు నీరు జామ్ కాకుండా చూస్తాం. త్వరలోనే బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తాం.

స : తహసీల్దార్ కార్యాలయం రోడ్, ఫారెస్ట్ ఆఫీస్ రోడ్‌లో చెట్ల కొమ్మలు వాలిపోయి ఇబ్బందికరంగా మారింది. నటరాజ్ సెంటర్‌లో వర్షం వస్తే నీళ్లు నిలుస్తున్నాయి.

  – శ్రీనివాస రావు, మార్కెట్ ఏరియా

క : చెట్లు కొమ్మలతో కలిగే సమస్యను తప్పక పరిష్కరిస్తాం. నటరాజ్ సెంటర్‌లో నీరు నిలిచే ప్రదేశాన్ని కూడా పరిశీలిస్తాం.

- **స :** బాపూజీనగర్‌లో మసీదు పక్కన ఆరడుగుల డ్రెయినేజీలు ఉన్నాయి. దీంతో దోమల బెడద పెరిగి ఆస్పత్రుల పాలవుతున్నాం. నిత్యం దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.

  – చంద్రశేఖర్, బాపూజీ నగర్

క : సమస్య పరిశీలించి పరిష్కరించేలా కృషి చేస్తాం.

- **స :** శ్రీనివాస కాలనీ గుట్ట రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణాలు పూర్తి చేయలేదు. వీధి లైట్ల సమస్య ఉంది. చెత్త సేకరణకు ఎవరూ రావడం లేదు.

  – శ్రీలత, శ్రీనివాస కాలనీ

క : ఇంజనీరింగ్ అధికారులను పంపి పరిశీలిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చూస్తాం.

- **స :** వికలాంగుల కాలనీలో రెండేళ్లుగా డ్రెయినేజీల్లో పూడిక తీయడం లేదు. దోమలతో ఇబ్బంది పడుతున్నాం.

  – కె.సుబ్బారావు, వికలాంగులకాలనీ

క : డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం.

- **స :** వెంగళరావు కాలనీలో కొంతమేర సీసీ రోడ్డు లేదు. చెత్త కుప్పలు పేరుకుపోయాయి. డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు.

  – పోసాని శ్రీనివాసరావు, వెంగళరావు కాలనీ

క : సీసీ రోడ్డు లేనిచోట నిర్మాణానికి పరిశీలన చేస్తాం. పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటాం.

- **స :** కుక్కలను పట్టి ఏబీసీ సెంటర్లలో స్టెరిలైజేషన్ చేస్తున్నారు. అక్కడ నిబంధనలు పాటించకపోవడంతో మూగజీవాలు మృతి చెందుతున్నాయి. పరిశీలించేందుకు వెళితే రానివ్వడం లేదు.

  – దీపిక, పాల్వంచ

క : ఏబీసీ సెంటర్లను ఎప్పుడైనా తనిఖీ చేయొచ్చు. ఈ విషయంలో అక్కడి సిబ్బందితో మాట్లాడుతాం. నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం.

- **స :** విద్యుత్ కాలనీ 5వ లైన్‌లో డ్రెయినేజీ పనులు ప్రారంభం కాలేదు. దోమల నివారణకు ఫాంగింగ్ చేపట్టాలి.

  – వంశీకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, విద్యుత్ కాలనీ

క : విద్యుత్ కాలనీలో త్వరలోనే డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తాం. కొత్త కాలనీ అయినందున సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం. తప్పక ఫాగింగ్ చేయిస్తాం.

'ఆయిల్‌పాం'ను ప్రథమ స్థానంలో నిలపాలి

ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి



పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న రాఘవరెడ్డి

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం సాగు విషయంలో దేశంలోనే తెలంగాణను ప్రథమ స్థానంలో నిలపాలని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. అశ్వారావుపేట, అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలు, నారంవారిగూడెం వద్ద గల ఆయిల్‌ఫెడ్ నర్సరీ, పామాయిల్ గెలలు, తోటలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆయిల్‌పాం సాగులో రికార్డు సృష్టించిందని అన్నారు. ఈ ప్రాంత సాగు అనుభవాలతో వరంగల్, కరీంనగర్, మహబూబ్ నగర్, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో సాగు విస్తరించినట్లు వివరించారు. దేశంలో ఏటా కోటి టన్నుల ఆయిల్ అవసరం కాగా, 3 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపారు. ఆయిల్‌పాం సాగుకు ఎంతకాలమైనా ఢోకా లేదని, రైతులు ధైర్యంగా సాగు చేయొచ్చని సూచించారు. ఈ తోటల్లో అంతర్ పంటగా కోకో, వేరుశనగ, పత్తి, మొక్కజొన్నతో పాటు చిన్నపాటి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని అదనపు ఆదాయం పొందాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, రిసోర్స్ ట్రైనింగ్ అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో 'కాయకల్ప' పరిశీలన


ల్యాబ్‌లో పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యుడు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిని బుధవారం ముగ్గురు సభ్యులతో కూడిన కాయకల్ప బృందం పరిశీలించింది. వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రియ, డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ సురేష్‌లు బృందంలో ఉన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏటా అందించే కాయకల్ప అవార్డు ఇంటర్నల్ పీర్ అసెస్‌మెంట్‌లో భాగంగా బృందం సభ్యులు ఆస్పత్రిని సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి స్వచ్ఛత, సదుపాయాలు, బయోమెడికల్ వేస్టేజ్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, పారిశుద్ధ్య రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రసవాల సంఖ్య, రోగుల సంఖ్య, ఆస్పత్రిలో అభివృద్ధి, నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంతోష్, నర్సింగ్ సూపరింటెండెంట్ యశోద, సిబ్బంది నాగేంద్రమ్మ, భవాని, సుందరి, వర్ధిని, పుష్ప, రాజ్యలక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

'వరద' జాగ్రత్తలపై అవగాహన


మాట్లాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఉపేంద్రకుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ కళాశాలల విద్యార్థులకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, టెన్త్ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ విజయవాడ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ మాట్లాడారు. ఉరుములు, మెరుపులు, వడగళ్ల వాన, కుంభవృష్టి, బలమైన గాలులు, వరదల సమయంలో చేయాల్సిన, చేయకూడని పనులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు యువతకు తగిన అవగాహన ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై తగిన శిక్షణ ఇస్తామని వివరించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..?


అటవీ ప్రాంతంలోని పురాతన ఆలయం వద్ద తవ్వకాలు జరిపిన ప్రాంతం

ములకలపల్లి: మండల పరిధిలోని నర్సాపురం – తోగ్గూడెం గ్రామాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లను బుధవారం స్థానికులు గుర్తించారు. కోటెమ్మతల్లి ఆలయ సమీపంలో గుట్టల్లో చారిత్రక నేపథ్యం కలిగిన అనేక పురాతన ఆలయాలు ఉండగా, అవన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. కాగా గుప్త నిధుల కోసమే గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు పాల్పడి ఉంటారని ప్రచారం సాగుతోంది.

జాతీయ కరాటే పోటీల బ్రోచర్ల ఆవిష్కరణ


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న క్రీడా ప్రతినిధులు

కొత్తగూడెంటౌన్: వచ్చే నెల 18న నల్లగొండ జిల్లా భువనగిరిలో జరిగే జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్‌ను బుధవారం క్రీడా సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో పి.కాశీహుస్సేన్, ఇ.మొగిలి, ఐ.ఆదినారాయణ మాట్లాడారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, క్రీడా సంఘాల బాధ్యులు కే. శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, ఎం.రమేష్, స్వాతిముత్యం, నిహారిక, బి.సాగర్, మల్లికార్జున్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

పాల్వంచ: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్లో ప్రవేశాల కోసం ఈనెల 26, 27వ తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ గ్రూప్‌లతో పాటు ఒకేషనల్ గ్రూప్‌ల్లో మిగిలిన సీట్ల భర్తీకి కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. బాలికలకు 26వ తేదీన టేకులపల్లి గురుకులంలో, బాలురకు 27వ తేదీన తిరుమలయపాలెంలో కౌన్సెలింగ్ ఉంటుందని, విద్యార్థులు పదో తరగతి మెమో, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

అందని ఎంసీహెచ్ కానుకలు

- మూడేళ్లుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వాలు
- ఉమ్మడి జిల్లా మంత్రులు స్పందించాలని లబ్ధిదారుల విన్నపం


జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో బాలింతలు(ఫైల్)

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించే బాలింతలకు ఇచ్చే ఎంసీహెచ్ కానుక అందని ద్రాక్షగానే మారింది. ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవంతోపాటు కానుక వస్తుందని ఎక్కువ మంది గర్భిణులు జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్), భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కాన్పులు పొందుతున్నారు. ఎంసీహెచ్‌లో ప్రతీ నెలా 250 కాన్పులు జరుగుతున్నాయి. జిల్లా పలు ప్రాంతాల్లోని గర్భిణులు ఎంసీహెచ్‌కే వస్తున్నారు. ఇక పరిస్థితి క్రిటికల్‌గా ఉన్నవారిని జిల్లావ్యాప్తంగా ఇక్కడికే రిఫర్ చేస్తున్నారు. దీంతో కాన్పుల సంఖ్య పెరుగుతున్నా.. మూడున్నరేళ్లుగా బాలింత కానుకలు అందడం లేదు. మీ అకౌంట్లోనే నగదు జమ అవుతుందని, తిరగాల్సిన అవసరం లేదని అధికారులు బాలింతలకు చెబుతున్నారు.

రూ.13.43 కోట్లు పెండింగ్

2017లో గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టింది. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన బాలింతలకు బాబు జన్మిస్తే రూ. 12 వేలు, పాప జన్మిస్తే రూ.13 వేలు ఇచ్చారు. కాగా జిల్లాలో 2022 సంవత్సరంలో 8,681 మందికి రూ.10,04,17,200 నగదు జమ చేయాల్సిఉంది. 2023లో 2,515 మందికి రూ 3,03,80,000 ఇవ్వాల్సిఉంది. మొత్తం 11,196 మందికి రూ.13 కోట్ల 43 లక్షల 52 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం కేసీఆర్ కానుక నిధులు విడుదల చేయలేదు. దీంతో బాలింతలకు కేసీఆర్ కానుక అందలేదు.

కొత్త ప్రభుత్వంలోనూ..

గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 3 వేల మంది ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు పొందారు. వీరికి కూడా ఎంసీహెచ్ కానుక రావాల్సి ఉంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాలోని మంత్రులు స్పందించి ఎంసీహెచ్ కానుక నగదు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

న్యూట్రిషియన్ కిట్ కూడా..

ఎన్నికల ముందు నుంచి గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్ రావటం లేదు. జిల్లాకు 2 వేలు కిట్ల అవసరం ఉంది. కిట్లలో గర్భిణులకు ఉమెన్స్ హార్లిక్స్, నెయ్యి, ఐరన్ మందులు, ఖర్జూరాలు ఉంటాయి. జిల్లాలో వెయ్యి మందికి పంపిణీ చేయాల్సి ఉంది. ప్రతి గర్భిణికి మూడో నెల ఒక కిట్, ఏడో నెల ఒక కిట్ పంపిణీ చేస్తారు. జిల్లాకు రెండు నెలలుగా ఈ కిట్లు రావటంలేదు. దీంతో గర్భిణులకు పోషకాహారం అందని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం



జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించినవారి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు విడుదల చేస్తే నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయి. ఎంసీహెచ్ కానుకలు కచ్చితంగా వస్తాయి. ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి. జిల్లాలోని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– ఆర్.చైతన్య, పీఓ, ఎంసీహెచ్

టీచర్‌పై చీటింగ్ కేసు

- అవినీతి ఆరోపణలతో ఇప్పటికే సస్పెండ్ చేసిన కలెక్టర్
- మరో ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: సస్పెండైన ఉపాధ్యాయురాలిపై ఎనిమిది రోజుల విచారణ అనంతరం బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మరో ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. త్రీటౌన్ సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఎయిడెడ్ ఉపాధ్యాయురాలుగా పని చేసిన టి.పద్మావతిని సస్పెండ్ చేస్తూ గత నెల 15న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు చేయాలని విచారణ అధికారి సంజీవరాజుకు ఆదేశాలు ఇవ్వడంతో, ఆయన కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ పోలీసులు ఎనిమిది రోజులపాటు ఫిర్యాదుదారులను, సాక్షులను విచారించారు. విచారణలో పద్మావతి, మరో పది మంది ఉపాధ్యాయుల వద్ద సర్వీస్ ధ్రువీకరణకు రూ.91 లక్షల వరకు తీసుకుని, పాఠశాల యాజమాన్యానికి రూ.55 లక్షలకుపైగా ఇచ్చింది. రూ.35.50 లక్షల వరకు ఆమె తీసుకుంది. సర్వీస్ ధ్రువీకరణ ఇప్పించకపోగా, వారి డబ్బులు వారికి తిరిగి ఇవ్వలేదని తేలింది. దీంతో పద్మావతిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఆమెకు వరుసకు తమ్ముడు అయ్యే ఉపాధ్యాయుడు నాగకుమార్ గతంలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా హెచ్‌ఎంగా ఉన్న పద్మావతి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. విద్యార్థినుల తల్లిదండ్రులు గతంలో ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోలేదనే ఆరోపణలు ప్రస్తుతం రుజువు కావడంతో నాగకుమార్‌పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ ఘటనలపై ఏడాదికాలంగా విచారణ అధికారి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు విచారణ జరిపి నివేదిక అందించిన నేపథ్యంలో ఇద్దరు ఉపాధ్యాయులపై వేటు పడింది.

అదుపుతప్పి లారీ బోల్తా


పల్టీ కొట్టిన ఊక లారీ

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి ఓ లారీ బోల్తా పడిన ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి నుంచి ఏపీ వైపు ఊక లోడుతో వెళ్తున్న లారీ అశ్వారావుపేట సరిహద్దు చెక్ పోస్టు వద్ద రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేస్తుండగా, అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఊక కింద పడిపోగా, డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

పలువురి రిమాండ్

దుమ్ముగూడెం : వివిధ కేసుల్లో పలువురు నిందితులను బుధవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.అశోక్ కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం పర్ణశాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. వీరిలో ఐదుగురు వ్యక్తులు పాశం సందీప్, వల్లెపు సాధు, మధ్య శ్రీను, ఎలగందుల నరేంద్రబాబు, గొల్లపూడి శ్రీనివాసరావులపై గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. నిందితులను భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. గుడుంబా కేసు ముద్దాయి భూక్య వీరన్నను భద్రాచలం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

మావోయిస్టు పార్టీ కొరియర్ అరెస్టు

చర్ల: నిషేధిత మావోయిస్టు పార్టీకి కొరియర్‌గా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తిని చర్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. చర్ల మండలం పెదమిడిసిలేరు సమీపాన గల తాలిపేరు ఎడమ ప్రధాన కాల్వ వద్ద చర్ల పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ బలగాలు తనిఖీలు చేపడుతుండగా ఓ వ్యక్తి వీరిని చూసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో ఆయనను పట్టుకుని విచారించగా చర్ల మండలం రజబ్‌లీలీకాలనీకి చెందిన కారం సమ్మయ్యగా తేలింది. ఆయన మావోయిస్టు పార్టీకి కొరియర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పడమే కాక మావోలకు అందించేందుకు పేలుడు పదార్థాలు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని సమ్మయ్యను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో చర్ల సీఐ ఏ.రాజువర్మ, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.


కొరియర్ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకిత్‌కుమార్

పాము కరిచిందని హైరానా


- ఇద్దరి ప్రాణం తీసిన రోడ్డు ప్రమాదం
- ఆస్పత్రికి వెళ్లే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో ఘటన
- పాముకాటు బాధితుడితో పాటు ఇంకో వ్యక్తి మృతి


సైదులు (ఫైల్)

కారేపల్లి: ఓ పక్క పాము కరిచిందనే ఆందోళన.. త్వరగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకోవాలనే కంగారులో ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తుండగా అదుపు తప్పడంతో పాము కరిచిన వ్యక్తి, వాహనంపై ఉన్న ఇంకొంకరు తీవ్రగాయాలతో మృతి చెందాడు. కారేపల్లి మండలం మేకలతండా గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మేకలతండా గ్రామానికి చెందిన జాటోతు సైదులు(32) మినీ డెయిరీ ఫామ్ నిర్వహిస్తుండగా అందులో పనిచేసేందుకు మహారాష్ట్ర నుంచి ఇద్దరు కూలీలు వచ్చారు. వీరు బుధవారం షెడ్డులో పనిచేస్తుండగా సైదులు కాలిపై పాము కరిచింది. దీంతో మహారాష్ట్రకు చెందిన కూలీని తీసుకుని బైక్ సైదులే నడుపుతూ కారేపల్లి ఆస్పత్రికి బయలుదేరారు. పాము కరిచిన నేపథ్యాన త్వరగా చికిత్స చేయించుకోవాలనే భావనతో సైదులు వేగంగా నడుపుతుండగా మార్గమధ్యలో తల తిరగడంతో బైక్ అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొట్టి పక్కనే ఉన్న పొలంలో పడిపోయింది. అక్కడ రాళ్లు ఉండడంతో వీరిద్దరి తలకు తీవ్రగాయాలు కాగా అపస్మారకస్థితికి చేరారు. ఆ మార్గంలో వెళ్తున్న రైతులు ఆలస్యంగా వీరిని గుర్తించి ఆటోలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే సైదులు, ఆయనతో పాటు ఉన్న కూలీ మృతి చెందారు. సైదులుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, ఉపాధి కోసం వచ్చిన మహారాష్ట్ర కూలీ మృత్యువాత పడడం విషాదాన్ని నింపింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుక్క అడ్డు రావడంతో ఘటన


శ్రీనివాసరావు (ఫైల్)

దమ్మపేట/పెనుబల్లి: రహదారిపై ఆకస్మాత్తుగా కుక్క అడ్డు రావడంతో కింద పడిన ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన దమ్మపేట మండలం గణేష్‌పాడు క్రాస్ రోడ్డు సమీపాన బుధవారం చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం యేరుగట్ల రామచంద్రపురం గ్రామానికి చెందిన తాటి శ్రీనివాసరావు(40) ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలోని పుట్టింట్లో ఉన్న భార్య వద్దకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. దమ్మపేట మండలం గణేష్‌పాడు క్రాస్ వద్దకు చేరుకోగా అకస్మాత్తుగా ఓ కుక్క ఎదురుగా పరిగెత్తుకుంటూ వచ్చి ఆయన బైక్‌ను తాకింది. దీంతో శ్రీనివాసరావు కింద పడగా తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది చేరుకుని మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఇల్లు కూలిందని..

మనోవేదనతో వృద్ధుడి మృతి


వెంకటేశ్వరరావు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఇటీవల పెదవాగు ప్రాజెక్ట్‌కు గండ్లు పడటంతో వరద ముంపునకు గురై ఇల్లు కూలిపోయిందనే మనోవేదనతో ఓ వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేశ్వరరావు(62) పూరి గుడిసె గడిచిన గురువారం రాత్రి వరద ముంపు గురై గోడలు కూలిపోగా, గుడిసె నేలమట్టమైంది. కాగా వెంకటేశ్వరరావు కొంతకాలంగా ఉబ్బసం వ్యాధితో బాధ పడుతున్నాడు. వృద్ధ దంపతులకు గుడిసె ఆధారంకాగా, వరదతో అది కూలిపోవడంతో తీవ్ర మనోదేనకు గురయ్యాడు. దీంతో మంగళవారం అతని భార్య పిచ్చమ్మ ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరావిగూడెంలో ఉన్న కుమార్తె వద్దకు తీసుకెళ్లింది. కాగా బుధవారం ఒక్కసారిగా కుప్పకూలి పడిపోగా భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుకు గురై మృతి చెందిన నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

డీసీసీబీలో 37,625 మందికి రుణమాఫీ

చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు


బేతంపూడి సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

టేకులపల్లి/ఇల్లెందు రూరల్/గుండాల/కామేపల్లి/కారేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన రుణమాఫీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు సూచించారు. టేకులపల్లి మండలం బేతంపూడి పీఏసీఎస్, ఇల్లెందు, గుండాలలోని పీఏసీఎస్, డీసీసీబీ బ్రాంచ్‌తో పాటు కామేపల్లి మండలం తాళ్లగూడెం, కారేపల్లిలోని డీసీసీబీ బ్రాంచ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రుణమాఫీ అయిన రైతులు రెన్యువల్ చేయించుకుని తిరిగి రుణం పొందితే దళారులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. డీసీసీబీ పరిధిలో 37,625 మంది రైతులకు రూ.121,63,40,360 రుణమాఫీ జరుగుతోందని తెలిపారు. రూ.లక్ష లోపు రుణం కలిగిన వారిలో ఇంకొందరికి జమ కావాల్సి ఉందని చెప్పారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల నూతన సొసైటీల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉందని చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఆయన పీఏసీఎస్‌లకు వచ్చిన రైతులతో మాట్లాడి రుణమాఫీ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్లు మేకల మల్లిబాబు యాదవ్, జనగం కోటేశ్వరరావు, పీఏసీఎస్‌ల చైర్మన్లు లక్కినేని సురేందర్‌రావు, మెట్టెల కృష్ణ, గొగ్గెల రామయ్య, పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ బ్రాంచ్‌ల మేనేజర్లు విజయ, అరెం లక్ష్మయ్య, నాగరాజు, రామస్వామి, బాల రవికుమార్, సీఈఓలు పొన్నోజు ప్రేమాచారి, హరిప్రసాద్, రాంబాబు, నాగయ్య, బి.హన్మంతరావుతో పాటు చీమల లక్ష్మీనారాయణ, బానోతు ఇస్తారి, కందుల వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, యాకూబ్, కాంతారావు, అడ్డగోడ ఐలయ్య, బానోతు హీరాలాల్, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌బీఓపై బదిలీ వేటు

పాల్వంచరూరల్: ఇటీవల కిన్నెరసానికి వచ్చిన పర్యాటకులపై ఎఫ్‌బీఓ కర్రతో దాడి చేయగా, సదరు అధికారిపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. ఈ నెల17న కిన్నెరసానికి కొత్తగూడెం నుంచి ఇద్దరు పర్యాటకులు వచ్చారు. ఆ సమయంలో వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టులో ఎఫ్‌బీఓ రవికుమార్ విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా ప్రవేశ టికెట్ విషయమై వారితో వాగ్వాదం నెలకొంది. దీంతో ఎఫ్‌బీఓ పర్యాటకులపై కర్రతో దాడి చేశాడు. ఈ ఘటపై విచారణ జరిపి రవికుమార్‌కు మెమో జారీ చేయడంతోపాటు ములకలపల్లికి బదిలీ చేశామని ఎఫ్‌డీఓ బాబు తెలిపారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

అదనపు కలెక్టర్ విద్యాచందన


రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

టేకులపల్లి: లాభసాటి పండ్ల మొక్కలు, వ్యవసాయంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. మండల పరిధిలోని సులానగర్ గ్రామంలోని మామిడి, పామాయిల్ తోటలను పరిశీలించారు. అనంతరం తావుర్యా తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పళ్ల తోటల పెంపకం, మునగ, డ్రాగన్ ఫ్రూట్ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. మీ సేవ కేంద్రాల ఏర్పాటు, స్త్రీ శక్తి పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది లక్ష్మీగణేష్ గాంధీ, కాలంగి శ్రీనివాస్, తిరుపతయ్య, పవిత్ర, అజయ్, భీముడు, సురేష్, చాంద్మల్, లఖన్, నరేందర్ పాల్గొన్నారు.

మణుగూరు ఆస్పత్రిలో ఒకేరోజు 12 ప్రసవాలు


సాధారణ ప్రసవాలు జరిగిన బాలింతలు, శిశువులతో వైద్య సిబ్బంది

మణుగూరు టౌన్ : మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో బుధవారం ఒకేరోజు 12 ప్రసవాలు జరిగాయి. ఇందులో ఏడు శస్త్ర చికిత్సలు కాగా, ఐదుగురికి సాధారణ ప్రసవాలు అయ్యాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. మణుగూరు పరిసర ప్రాంతాలైన శివలింగాపురం, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, పాల్వంచ, జానంపేట ప్రాంతాలకు చెందిన వారు ప్రసవాల కోసం ఇక్కడికి వచ్చారని వివరించారు. కాగా, ఒకేరోజు 12 కాన్పులు చేసిన వైద్యులు భవాని, కృష్ణప్రసాద్, నర్సింగ్ ఆఫీసర్ కవిత, లలితాబాయి, ఓటీ నర్సింగ్ ఆఫీసర్ బేబీరాణి, కల్పన, లాల్‌ఖాన్‌లను కలెక్టర్ జితేష్ పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ రవిబాబు అభినందించారు.

గొర్రెలు, మేకలు అపహరణ

సుజాతనగర్: గొర్రెలు, మేకలను అపహరించిన ఘటన వేపలగడ్డ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చెన్నబోయిన లింగయ్య తన గొర్రెలు, మేకలను రోజూ రాత్రి బంధువుల రేకుల షెడ్డులో ఉంచుతాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి షెడ్డులో నుంచి మేకలు, గొర్రెల అరుపులు వినిపించాయి. వెళ్లి చూడగా రూ.50 వేల విలువ చేసే మూడు మేకలు, మూడు గొర్రెలను దుండగులు అపహరించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పీడీఎస్‌యూ నాయకుడి అరెస్ట్

ఇల్లెందురూరల్: మండల పరిధిలోని కొమరారం గ్రామంలో పీడీఎస్‌యూ నాయకుడు కాంపాటి పృథ్వీని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రగతి భవన్ ముట్టడికి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా అరెస్ట్ చేసినట్లు కొమరారం సబ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


సీతారాములు మృతదేహం

అన్నపురెడ్డిపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాణావత్ సీతారాములు(47) మద్యానికి బానిసగా మారి, డబ్బుల కోసం కుటుంబ సభ్యులను తరచుగా వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో బుధవారం మద్యానికి కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో క్షణికావేశంలో అంకమ్మతల్లి ఆలయ సమీపంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన ఆలయ పూజారి, స్థానికులు 108కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అతడిని అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

డెంగీతో మహిళ మృతి

చర్ల రూరల్: మండలంలోని ముత్యాలమ్మ తల్లి వీధి ప్రాంతానికి చెందిన బొగ్గుల కాంచన(48) డెంగీతో మృతి చెందినట్లు బుధవారం కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త వృత్తి రీత్యా ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురంలో నివాసముంటున్నాడు. కాంచనకు, ఆమె కుమారుడు వెంకటసాయిలకు డెంగీ జ్వరం రావడంతో బుధవారం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కాంచన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం కుమారుడు చర్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి..

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం శ్రీరామచంద్రస్వామి దర్శనం కోసం సోలాపూర్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి కొత్తగూడెంలో మృతి చెందాడు. సోలాపూర్‌కు చెందిన దశరథ్ బోగా(67) భద్రాచలం బయల్దేరి మంగళవారం కొత్తగూడెం చేరుకున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ ఏరియాలో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కుప్పకూలి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దశరథ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో దశరథ్ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి, ఆధార్‌కార్డులోని వివరాల ప్రకారం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతుడి కుమారులు బుధవారం కొత్తగూడెం వచ్చి దశరథ్ మృతదేహాన్ని సోలాపూర్‌కు తరలించారు.

రైలు ఎక్కబోతూ కిందపడి యువకుడి..

పాల్వంచ : రైలు ఎక్కబోతూ జారి కిందపడి పాల్వంచకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. పాల్వంచ జ్యోతినగర్‌కు చెందిన ఆరీఫ్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి పాల్వంచకు వచ్చేందుకు మౌలాలీ స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు అనుకుని వేరేది ఎక్కాడు. ఇంతలోనే అది కాదని తెలుసుకుని దిగి రాగా, అప్పటికే కాకతీయ రైలు కదులుతోంది. పరుగున వచ్చి రైలు ఎక్కబోతుండగా జారి కిందపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఆరీఫ్ తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా మరో సోదరుడు ఉన్నాడు.